అయితే యువతి వాటివంక చూచిందీలేదు ! యువతిలో అందం లోకం మఱి గమనించిందీ లేదు ! ఊడలాగికోకుండా ఆ రెండుచీమలను వేడివుంటే ఎంత మంచి జరివుండేదో ! ఆమెకూ ఆ చీమలకూ కూడా !

.... .... .... .... ....

## బంగ్లయ్యకు గుడ్ - లక్ !

లార్డు లివియథాన్ ఇంగ్లీమాన్. లివియాథాన్ ప్రభ్వికూడా ఆదేశానకు చెందిన మనిషే. వాళ్ళ పిల్లలందఱూ కూడా ఆ దేశంలో జన్మించినవారే "కన్సెప్షెన్" ఏ దేశంలో కానీయండి.

లివియథాన్ కుటుంబంవారి చాయ ఉడుకుసున్నంలో పైకెత్తిన దూదిపింజెల చాయ నొప్పుతూ, లోపలి వెచ్చని నెత్తురుయొక్క కావి ఆవి బూరిబుగ్గల్ని బుసకొొట్టేలా, బొద్దు దేఱి అద్దుకాగితాల్లాంటి దళాసరి చర్మంతో వెలిసివుంటుంది. ఇండియాదేశపు వేడిమి తట్టుకోలేక ముహుర్ముహుర్ఘర్మవారి నేరులు కట్టుకుంటూ "సీలింగు ఫానుల" క్రింద కూర్చుండి "దిఫ్రెజిడీర్ కూలింగు ప్రిసెర్వెడ్ ఫుడ్సు" ఫలాహారంగా అహరిస్తూ, వారున్నారు ఈ కథాకాలంనాటికి.

లివియథాన్ ప్రభువువద్ద వుండే బట్లేరుపేరు బంగ్లయ్య. బంగ్లయ్య, పక్కానేటివ్, అవుగాక ! చిన్నప్పుడే మతముచ్చుకు, మూచూచి మూచూచి ముట్టుకొన్నట్టుగా, "వూ"చేసి "వూ"చేసి కట్టుకున్నాడు అనుతాపి అనే ఒక బిబ్లికల్ మహాపాపిని.

బిబ్లికల్ పాపి యంటే ఏడమ్ అండ్ ఈవ్ దంపతుల ప్రణయఫలితంగా పరిణమించిన పరంపర పాపజన్మ అన్న మాట. అంతే, అంతకంటె వేఱే పాపం చేసింది లేదు ఆ యిల్లాలు.

ఆ నేటివ్ క్రిస్టియన్ దంపతులిద్దరూ, ఒకరు నల్లతుమ్మ కాల్చగా వచ్చిన బొగ్గు చాయనుంటే, ఒకరు సింగరేణి గనుల నుండి వెలిబుచ్చిన రాక్షసిబొగ్గు చాయనుండేవారేగాని ఒక ర్నొకరు తీసిపోయేవారు ఏమాత్రం కారు. మఱిన్నీ వారిపిల్లలు డజనుమంది. డజనుమందిని వరుసగా పరుండపెడితే వాల్చిన బ్లాక్‌బోర్డు యని అనుకొని తీరాలి.

కాని ఎప్పుడున్నూ బంగ్లయ్య బాపతు ప్రజాసమూహం లివియథాన్ దంపతులు కంటబడింది లేదు. వీళ్ళ ఉనికి ఊరు పట్టువీడు విశ్రాంతి పాడువేలు. బంగ్లయ్య వొక్కడే బస్లేరు. ఏ రూపాన్నో వో రూపాన్ని నిత్యం లివియథాన్ దంపతులింట ప్రత్యక్షమయివుండేవాడుకూడా అతడొక్కడే !

కాని రోజులైనా సరే, కరువురోజులైనా సరే, కర్మకాండ తప్పదు గదా ! 25-12-? క్రిస్టమస్ పండగ వచ్చింది. అదివఱ కల్లా బంగ్లయ్య వొక్కడే దొరగారికి, వారి కుటుంబానికి చెప్తూ యుండేవాడు "సంతోషకరమైన ; కిసిమిసి" ఆ సంవత్సరం పిల్లల్ని పెళ్ళాన్నికూడా తీసుకువెళ్ళి దొరగారికి, దొరగారి భార్యకు, వారి పిల్లలకు తాను కుటుంబ సమేతంగా "సంతోష కరమైన కిసిమిసి" చెబ్దామని సంకల్పించుకున్నవాడై, రెండు దండలూ, ఓ బిస్కట్ల డబ్బా పట్టుకు బయలుదేఱాడు, తెల్లాటి ఎనిమిదికే ఆ పొద్దు బంగ్లయ్య.

డజనుమంది నేటివ్ పిల్లలూ, బంగ్లయ్య, బంగ్లయ్య భార్య అనుతాపి బజారంటే నడుస్తూ క్రమక్రమంగా లివియథాన్

దొరగారి బంగాళాగుమ్మం చేరుకునేలో, వారి వెనకాల, ఎఱ్ఱటి వోళ్ళు, పచ్చటివోళ్ళు, చామనచాయవోళ్లు, ఓ మోస్తరు నల్లని వోళ్ళు, ఏ చాయాలేని వోళ్లు, ఎంత తోమినా రానివోళ్ళు, హిందువులూ, ముస్లిమ్‌లూ, వీరందఱూ, ఎంత లేదన్నా, ఓవంద మంది వెంటాడించారు.

"వీరందర్నీ ఎలా పోషిస్తున్నాడు? ఈ బంగ్లయ్య ఈ రోజుల్లో" అని ఆశ్చర్య పోసాగినారు.

"పోషణ జరక్కే దొరగారి దర్శనార్థం తీసికెడుతూ ఉన్నాను" యన్నాడు అతిజాలిగా బంగ్లయ్య ప్రక్క ప్రక్కనున్న జనంతో. "దొరగారెంత దొడ్డోరైనా ఇంతమందిని పోషించుకునే సూత్రం చూపిస్తారా ఈ వెఱ్ఱిమొహానికి" అని కనిపెట్టి చూస్తూవున్నారు ప్రజానీకం. అనుతాపి ఎవరివంకా చూడకుండా తన బిడ్డలవంక తనవంక నేలంక చూసుకుంటూ నడుస్తూవుంది.

చేరుకున్నారు నగుమొగాల్తో లార్డు లివియథాన్‌గారి బంగాళా!

లార్డు లివియథాన్ వచ్చి, బంగ్లయ్య దంపతులు వేసిన పూలదండల సువాసన మెచ్చుకుంటూ, "బ్లాక్‌మార్కెట్టును పెంపొందింపజేస్తూ ఉన్నది మీ కుటుంబమే యనుకుంటాను బంగ్లయ్యా!" యని అభినందించాడు. వెంటనే బంగ్లయ్య మగనాలి "మావల్లను ఏమవుతుందండి! దొరగారూ! బియ్యం తెలుపు బిన్నిబట్ట తెలుపు, డఫ్ తెలుపు, పౌదరు తెలుపు! ఎంత నల్లటివాళ్లో కప్పెట్టినా ఎంత నల్లటి గుప్పిట్లో కుదించినా, తెలుపురంగు బయటపడి తీరుద్ది దొరగారూ! మా నల్లనోళ్ళవల్ల

ఏమవుద్ది దొరగారూ ! ఏదన్నా తమకే ! తెల్లదొరలకే సెల్లు తమకు మా సలాములు !" అంది వొయ్యారంగా.

ఎంతమందిని కన్నా అనుతాపి వొయ్యారం అదేమిటో ఆలాగే నిల్చివుంది "టీన్సు" లోలా "ఫోర్టైన్సు" అప్పుడున్నూ.

లార్డు లివియథాన్ అతి టిప్‌టోగా "మేం ఈ రోజునే క్విట్ ఇండియా కావిస్తున్నాం. మీకు తెలియదు కామోసు.

ఎప్పుడో అన్నాది.

ఈ నాడే నెరనేరుస్తున్నాం.

మీకు తావిస్తున్నాం. ఈలా ఆడవాళ్ళ దగ్గర్నుంచి వై దొలగమంటూ ఉన్నప్పుడు, మఱి వుండడం మాకు మంచిది కాదు. సామాను ప్యాక్ చేశేశాం, ఈ తత్క్షణం "క్విట్ ఇండియా" పంథా మేం మా కుటుంబం అమలుపెట్టేసి వేస్తున్నాం. "ఎ హాపీ క్రిష్టమస్ టుయు ఆల్ !" అన్నాడు పెద్ద నవ్వు నవ్వుతూ !

అనుతాపికి కళ్లు చెమ్మగిల్లాయి, బంగ్లయ్య లివియథాన్ పాదం ముట్టాడు. బాంగ్లీయులు మాత్రం "మీరు వెళ్ళిపోతే ఈ బంగళాలో మాం ప్రవేశిస్తున్నాం !" అన్నారు సగర్వంగా.

"ఉండుండి ! సత్వరం ప్రవేశించి వుండుండి ! మీ క్షేమం కొరకే మేం వెళ్ళిపోతున్నది" అని లివియథాన్ ప్రభువు ఒక తాళంచెవి ఆ పిల్లల కందించాడు.

ఆ తాళంచెవి తెల్లగా వుంది. "వెండి చెవిలాగుంది." అంది అనుతాపి వోరచూపు చూస్తూ. బంగ్లయ్య "దానిమీద క్రెసెంట్ చెక్కబడివుంది" అన్నాడు దూరపుజూపు ప్రకటిస్తూ. పిల్లలు తాళంచెవి పెట్టి తలుపులు తియ్యబోతే తలుపులు రావు. లోపల కిచకిచలు. తలుపుల సందులంట చూచేరు. లోపల కృష్ణ గద్దల సంతానం. జీసస్ లేడు మోసెస్ లేడు.

అప్పటికప్పుడే లివియథాన్ ప్రభువు ప్రభ్వితో వారి ప్రోజెనీతో అందరూ బోంబేమెయిల్ ఎక్కేసి—చల్! చల్! చల్! స్టీమర్ డెక్ మీద తొక్కేసి టక్! టక్! టక్! మరిన్ని దేవుడుమేలుచేస్తే లండన్నుండి బంగ్లయ్యకు కేబిల్—గుడ్ లక్! లక్! లక్!

.... .... .... .... ....

## ఎఱ్ఱకలవ చేతులా - నల్లకలవ ముఖమా

“యు ఆర్ డిశ్చార్జిడు ఫ్రమ్ దిస్ మోమెంట్” ఈ నివేషం తమకు వెళ్ళిపోవాలని వుంటే, వెళ్ళిపోవచ్చు హాస్పిటాల్లోంచి; మీజబ్బు కుదిరింది, మీరు కులాసాగా నున్నారు. ఇదిగో! పెద్ద దొరగారి ఉత్తరువు” అని తాఖీదు చూపించింది, అత్యుత్సాహంగా కళ్ళల్లో నవ్వు పెదవులమీదా ముక్కుకొనమీదా మెఱసేలా ఆ కోమలాంగి. కోమలాంగి అంటే నర్సు వీరవల్లి. పరాయిమనిషి కాదు. ఆమెచెప్పే ఆ వీడ్కోలు వాక్యాలు విని వేడుకపడ వచ్చునా? విశ్వసింగు మహదేవుకు వేడుకలేదు సరికదా విచారం పుట్టుకొచ్చింది.

అప్పటికి నెలరోజుల్నుండి ఆ హాస్పిటాల్లో స్పెషల్ వార్డు ఇన్‌పేషంటుగా వుంటూ, వీరవల్లి పెట్టిన రొట్టి, వీరవల్లి అందిచ్చిన పాలు, వీరవల్లి కొట్టిచ్చిన కోడిగ్రుడ్లు ఒకటేమిటి? ఆమె గ్రుచ్చిన సూదిమందుల దగ్గర్నుంచీ, డాక్టర్ సమక్ష మందు, డాక్టర్ పరోక్షమందూ కూడా తీసికొంటూ రోజూవారీగా